చిలుకూరు గురుకుల పాఠశాల గేట్ వద్ద పాఠశాల పేరుతో ఉన్న మార్బుల్ బండ దుస్థితి

బండ పడితే బతుకు ఆగమే..

- అధికారులకు లేదాయే ఏ మాత్రం చిత్తశుద్ధి
- అక్షరాలు రాలిపోయినా కనిపించవా..?

మొయినాబాద్, జూలై 7 : గురుకుల పాఠశాలల్లో చదువుకోవడానికి విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఏ మాత్రం కార్పొరేట్ పాఠశాలలు/కళాశాలలకు తీసిపోని విధంగా గురుకుల పాఠశాలలు ఎంతో అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలల విద్యను ప్రతి పేదవాడి బిడ్డకు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు విద్యతోపాటు వారికి కావాల్సిన మౌలిక వసతులు కూడా చాలా అవసరం. కానీ చిలుకూరు గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు పాఠశాల/కళాశాలకు ఉన్న నేమ్ బోర్డు ఊడిపోతున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ప్రధాన గేట్ వద్ద ప్రహరీకి మార్బుల్ స్టోన్ అతికించారు. మార్బుల్ స్టోన్‌కు పాఠశాల/కళాశాల పేరు స్టీల్ రేకులతో అక్షరాలుగా మార్చి అతికించారు. కానీ అతికించిన అక్షరాలు రాలిపోవడంతోపాటు గోడకు అతికించిన మార్బుల్ కూడా ఊడిపోయి కిందపడిపోయే ప్రమాదముంది. ఎవరైనా చూడకుండా నేమ్ బోర్డు వద్ద కూర్చుంటే మాత్రం గాలికి బండలు పడిపోయే అవకాశం ఉంది. ప్రతి రోజూ పాఠశాల/కళాశాలకు అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రధాన గోట్ ముందు ఉన్న నేమ్ బోర్డు పక్క నుంచే వెళ్తుంటారు. కానీ పాఠశాల పేరుతో ఉన్న మార్బుల్ స్టోన్ ఊడిపోవడాన్ని గమనించడంలేదా..? లేక గమనించినా తమకేందుకులే అని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారా..? అని పాఠశాలకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గురుకుల సంస్థ ఉన్నతాధికారులు కూడా నెలకు రెండుసార్లయినా పాఠశాలను సందర్శించి వెళ్తుంటారు. కనీసం వారికైనా కనిపించడం లేదా అని వారు వాపోతున్నారు. గురుకుల పాఠశాలల్లో ముందస్తు చర్యల కంటే ప్రమాదం జరిగిన తరువాతనే దిద్దుబాటు చర్యలుంటాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

హెచ్ఎండీఏ లే అవుట్‌ను అభివృద్ధి చేయాలి

తుర్కయాంజాల్, జూలై 7 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్ సర్వే నం.383/1లో హెచ్ఎండీఏ చేసిన లే అవుట్‌లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీని అభివృద్ధి చేయకుండా హెచ్ఎండీఏ అధికారులు చోద్యం చూస్తున్నారని హెచ్ఎండీఏ రాక్‌హిల్స్ కౌంటి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం మండిపడ్డారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లో హెచ్ఎండీఏ చేసిన లే అవుట్‌లో అసోసియేషన్ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. సరైన అభివృద్ధి చేయకుండా వేలం ద్వారా హెచ్ఎండీఏ ప్లాట్లను అమ్ముకుందని.. నేటి వరకు తమకు కనీస వసతులు కల్పించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా హెచ్ఎండీఏ అధికారులే ప్లాట్లు చేస్తే కొనుగోలు చేసినవారు ఏమి చేయాలని ప్రశ్నించారు. వెంటనే అధికారులు స్పందించి లే అవుట్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఎండీఏ రాక్‌హిల్స్ కౌంటి వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వర్షానికి కూలిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బేస్మెంట్

వికారాబాద్, జూలై 7 : వికారాబాద్‌లోని రైతు బజార్ పక్కన వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందనే మంచి ఉద్దేశంతో పనులు చేపట్టారు. ఈ నిర్మాణానికి రూ.7.20 కోట్ల నిధులు మంజూరు కాగా పిల్లర్లు, బేస్మెంట్ వరకు పనులు జరిగాయి. వికారాబాద్‌లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బేస్మెంట్ పూర్తిగా కూలిపోయింది. నాసిరకంగా పనులు చేపట్టడంతోనే కూలిపోయిందని పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో పట్టణ ప్రజల కల కలగానే మిగిలిపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నేడే వన మహోత్సవం..!

- ఈ ఏడాది 30.81 లక్షల మొక్కలతో సరిపెట్టనున్న సర్కారు
- కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు
- గత ప్రభుత్వ హయాంలో ఏటా హరితహారంతో కోటి మొక్కలు

సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కారు గ్రేటర్‌లో కంటి తుడుపు చర్యగా పచ్చదనం పెంపునకు సిద్ధమైంది. వన మహోత్సవం పేరిట ఈ ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం 30.81 లక్షల మొక్కలతోనే సరిపెట్టాలని నిర్ణయించింది. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసింది. ఈ మేరకు నేడు అన్ని సర్కిళ్లలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం జరిగే వన మహోత్సవాన్ని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఒక్కరోజే 7,135 మొక్కలను ప్రజాప్రతినిధులతో నాటనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం ఉప్పల్ సర్కిల్-2, హబ్సిగూడ సర్కిల్-8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రామంతాపూర్‌లో జరిగే కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి పాల్గొంటారు. పార్కులు, మీడియం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మొక్కల ఇస్తారు. అలాగే ఇంటింటికీ మొక్కలను సరఫరా చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

ఏటా కోటి మొక్కలు నాటిన బీఆర్ఎస్ సర్కారు

కేసీఆర్ ప్రభుత్వంలో వరుసగా 8 సార్లు హరితహారం కింద ప్రతి ఏటా గ్రేటర్‌లో కోటి మొక్కలను నాటారు. ఖాళీ స్థలాల్లో యాదాద్రి మోడల్ మియవాకి, వర్టికల్, థీమ్ పార్కులు, మెరిడియన్, అవెన్యూ ప్లాంటేషన్, జంక్షన్ సుందరీకరణ ట్రీ పార్కులు ఇలా రకరకాల పేర్లతో పచ్చదనం, సుందరీకరణ పనులను చేపట్టింది. కాలనీలను పచ్చదనంతో నింపేసింది. ఫలితంగా హైదరాబాద్ మహా నగర పరిధిలో 147 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది.తెలంగాణకు హరితహారం చేపట్టిన తర్వాత అటవీ విస్తీర్ణం 81.81 స్క్వేర్ కిలోమీటర్లకు పెరిగినట్లు ఎఫ్ఎస్ఐ ప్రకటించింది. ఎఫ్ఎస్ఐతో పాటు అర్బోర్ డే ఫౌండేషన్ సంస్థ, ఎఫ్ఏవో సంస్థలు 2020 సంవత్సరానికి హైదరాబాద్ నగరాన్ని ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్‌గా గుర్తించింది. పచ్చదనం పెంపునకు గత సర్కారు పెద్దపీట వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూడటం పట్ల పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు.

'ది కేవ్ పబ్'లో 'మత్తు' పార్టీ

గంజాయి తీసుకున్న 24 మందితో సహా మేనేజర్ అరెస్టు

శేరిలింగంపల్లి : వీకెండ్ థీమ్ పార్టీల పేరుతో డ్రగ్స్ పార్టీలను నిర్వహిస్తున్న ది కేవ్ పబ్‌పై పోలీసులు దాడి చేసి.. గంజాయి తీసుకున్న 24 మందితో సహా మేనేజర్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై డీసీపీ వినీత్ వివరాలు వెల్లడించారు. ఖాజాగూడలోని ఎస్‌వీ ఆర్కేడ్ భవనంలో ఉన్న 'ది కేవ్ పబ్'లో డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి ఎస్‌వోటీ, నార్కోటిక్, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఆ సమయంలో ఉన్న 55 మంది నుంచి నమూనాలు సేకరించగా, 24 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. పార్టీకి వచ్చే ముందు వీరందరూ డ్రగ్స్ తాగి ఈ పార్టీలో పాలు పంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

గ్రేటర్‌లో టాయిలెట్స్ కనిపిస్తలే ..!!

గతంలో 7,400 టాయిలెట్ల ఏర్పాటు
ప్రస్తుతం రికార్డులో 1857 మాత్రమే

సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో వందకు వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా సాధించాలనే లక్ష్యానికి అధికారులు నీళ్లొదిలారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎస్ ప్లస్ ప్లస్) నగరంగా హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు ప్రశ్నార్థకంగా మారింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్, వాటర్ ప్లస్, స్వచ్ఛ హైదరాబాద్ వంటి ర్యాంకులతో నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

కానీ గడిచిన ఏడు నెలలుగా టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కనిపించని పబ్లిక్ టాయిలెట్లకు బిల్లులు, వినియోగించని మరుగుదొడ్లకు నిర్వహణ వ్యయం చెల్లించడం జీహెచ్ఎంసీకే చెల్లింది. ప్రతి అర కిలోమీటర్ రద్దీ రోడ్లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సిన అధికారులు ప్రస్తుతం ఆరు జోన్లలో 4826 సీట్లలో 1857 పబ్లిక్ టాయిలెట్లను మాత్రమే నిర్మించినట్లు లెక్కలు చెబుతున్నాయి. గతంలో 7,400 టాయిలెట్ల నిర్మించగా, సగానికి పైగా వినియోగంలో లేవు. కొన్ని చోట్ల కనిపించడం లేదు. బిల్లుల చెల్లింపులు మాత్రం యథావిధిగా జరుపుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అంగన్‌వాడీ టీచర్.. ఆయాగా..

కందుకూరు, జూలై 7 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేకపోవడంతో టీచర్లు ఆయాలుగా మారుతున్నారు. ఆయాల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. దీంతో విద్యా బుద్ధులు నేర్పించాల్సిన చేతులు వంట పాత్రలను శుభ్రం చేస్తున్నాయి. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 12 మంది ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయాలు లేకపోవడంతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆయాలు చేయాల్సిన పనులతో పాటు తమ విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్‌గా ఆయాలను పెట్టుకోవాల్సి వస్తున్నదని, తమకు వచ్చిన వేతనాల నుంచి వారికి ఇవ్వాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆయాలను తక్షణమే నియమించాలని వారు కోరుతున్నారు.

కొత్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలో వంట పాత్రలను శుభ్రం చేస్తూ.. ఊడుస్తున్న అంగన్‌వాడీ టీచర్ సరస్వతి

ఆరుషి అరంగేట్రం అదిరింది..

కొండాపూర్, జూలై 7: సంగీత సప్తస్వరాలకనుగుణంగా నృత్య కదలికలతో ఆరుషి నాగభైరవ కూచిపూడి అరంగేట్ర నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకున్నది. ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ప్రముఖ నాట్య గురువులు నీలిమ గడ్డమణుగు సమక్షంలో ఆరుషి కూచిపూడి అరంగేట్రం చేసింది. ప్రదర్శనలో విఘ్నేశ్వరుని ప్రార్థనతో ప్రారంభించి.. లింగాష్టకం, భామా కలాపం, తరంగం, అన్నమాచార్య కీర్తన, థిల్లానా, గోవింద నామాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించిన తీరు విచ్చేసిన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ప్రదర్శనకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణలతోపాటు పలువురు ప్రముఖులు హాజరై ఆరుషిని ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన జాతీయ నృత్యోత్సవాలు

కొండాపూర్, జూలై 7 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న సృజన జాతీయ నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల భరతనాట్యం, కథాకళి, రాజస్థానీ నృత్యాలు, ఒడిస్సీ, ఛత్తీస్‌గఢ్ నృత్యాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ నృత్యోత్సవాలకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు అంజనాచౌదరి అన్నారు. ప్రదర్శనల అనంతరం కళాకారులను ఆమె ఘనంగా సత్కరించారు.

సివిల్స్ మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

హిమాయత్‌నగర్, జూలై 7: సివిల్స్ మెయిన్స్ రాసే పద్మశాలీ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కంద గట్ల స్వామి, నార్త్ అమెరికా పద్మశాలీ అసోసియేషన్ సలహాదారుడు సామల ప్రదీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్,పద్మశాలీ సేవా సమాజం ఆధ్వర్యంలో ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వారు తెలిపారు. శిక్షణ పొందేందుకు 8639998711 నంబర్‌ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆటో బంద్‌ను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ అమానుల్లాఖాన్

హిమాయత్‌నగర్, జూలై 7 : ఆటో డ్రైవర్ల న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 1న ఆటో బంద్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహమ్మద్ అమానుల్లాఖాన్ తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ల చార్జీలు పెంచాలని, రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ప్రతి ఆటో కార్మికుడికి రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు లక్ష్మీనర్సయ్య, మహ్మద్ అజీమోద్దీన్, హమ్మీ, ఆంజనేయులు, అక్తర్, షేక్ షరీఫ్, షేక్ రహీం, రమేశ్, మహ్మద్ లతీఫ్ ఖాన్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

స్ప్రింగర్ నేచర్ సైన్స్ జర్నల్‌లో సీడీఎఫ్‌డీ పరిశోధనా పత్రం

సిటీబ్యూరో, జూలై 7(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌కు చెందిన పరిశోధకులు ఫంగస్ జీవక్రియలపై చేసిన పరిశోధనలను ప్రముఖ సైన్స్ జర్నల్ స్ప్రింగర్ నేచర్ పబ్లిషర్ ప్రచురించనున్నది. టెక్స్బుక్ ఆఫ్ జూనోసిస్ అండ్ సప్రనోసిస్ పేరిట ఈ పరిశోధనలను ప్రచురించనున్నారు. రూపిందర్ కౌర్, అస్మితా సరోగీ, మనీషా గోశ్‌లు ఫంగస్ జీవక్రియలపై చేసిన పరిశోధనలు చేయగా.. ఆ ఫలితాలను ఈ జర్నల్ ప్రచురించేందుకు ముందుకు వచ్చింది. ఫంగస్ కారణంగా విపరీతంగా పెరుగుతున్న వ్యాధుల నియంత్రణకు ఈ పరిశోధనలు సాయపడుతాయని తెలిపారు. కాగా సీడీఎఫ్‌డీ పరిశోధనల కృషికి దక్కిన అరుదైన గౌరవమని పలువురు అభిప్రాయపడ్డారు.

సీనియర్ సెంటిస్టులకు ఘనంగా వీడ్కోలు

సిటీబ్యూరో, జూలై 7(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పరిశోధన కేంద్రంలో పలువురు సీనియర్ సైంటిస్టులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఐఐసిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో డా. చంద్రశేఖరం, డా. నాగేశ్వర రావు, డా. వేణుగోపాల్ రాజు, శ్రీధర్ కుమార్, డా. రమేశ్‌బాబు, అశోక్ కుమార్‌తోపాటు, శశికళ పలు హోదాల్లో రీసెర్చ్ సెంటర్‌లో సేవలు అందించగా... ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు.

వెటర్నరీ దవాఖాన ప్రారంభం

శంషాబాద్ రూరల్, జూలై 7 : మండలంలోని బుర్జుగడ్డతండా సమీపంలోని గోశాల వద్ద జంతు ప్రేమికుల విరాళాలు రూ. 3 కోట్లతో నిర్మించిన వెటర్నరీ దవాఖానను ప్రారంభించినట్లు గోశాల నిర్వాహకుడు ధర్మరాజ్ రాంఖా తెలిపారు. ధర్మరాజ్ రాంఖా మనుమరాలు డాక్టర్ నిషితా రంకఖా మాట్లాడుతూ దవాఖానలో ప్రతి రోజూ 10 సర్జరీలతో పాటు 100 జంతువులకు చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఐసీఏఐ విద్యార్థుల స్నాతకోత్సవం

విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

శేరిలింగంపల్లి, జూలై 7 : నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విద్యార్థుల స్నాతకోత్సవం గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరై సీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు ముప్పాల శ్రీధర్, దయానివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి 800 మంది, దేశవ్యాప్తంగా 9000 మంది చార్టెడ్ అకౌంట్స్ పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు.

టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రజా కార్యదర్శిగా అరుణేందర్ ప్రసాద్

టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రజా కార్యదర్శిగా ఎం. ఎన్.అరుణేందర్ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మరణం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేనీ.

– సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ)

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి

కుత్బుల్లాపూర్, జూలై 7 : క్షత్రియ సమాజ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ప్రణాళికాబద్ధంగా చదివి విజయానికి బాటలు వేసుకోవాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి/పట్కరి) ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశ్వనాథ్ రవీందర్ అధ్యక్షతన జీడిమెట్లలో ఎస్ఎస్‌కే సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా క్షత్రియ (ఖత్రి) కులానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి అక్షయ్ అనిల్‌వాఖరే, ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా.విశ్వనాథ్‌రవీందర్, అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ బాలకిషన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్